




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 4వ భాగం

మార్క్స్, ఎంగెల్సులు స్థాపించిన "కమ్యూనిస్ట్ కరస్పాండెన్స్ కమిటి "కి సంబంధించిన సమావేశాలు ఎక్కువగా మార్క్స్ ఇంటిలోనే జరుగుతుండేవి. అవన్నీ కూడా అండర్ గ్రౌండ్ కార్యక్రమాలే. వచ్చిన వాళ్ళందరికీ మార్క్స్ ఇంటిలోనే భోజనాలు. వాళ్ళ ఇల్లు జరగడమే అంతంత మాత్రంగా వున్న పరిస్థితుల్లో వచ్చిన వాళ్లకు కూడా ఆతిధ్యం ఇవ్వాలి. అయినా సరే మార్క్స్ గానీ, జెన్నీ గానీ అది అదనపు భారం అనుకోలేదు. అప్పటికి ఒక సంవత్సరం క్రితం ఒక పబ్లిషర్ "పొలిటికల్ ఎకానమీ" అనే పుస్తకం రాయమని 1500 ఫ్రాంకులు అడ్వాన్సు గా ఇచ్చాడు కదా... ఆ పుస్తకం పూర్తి అయితే, ఇంకా పారితోషికం వస్తుంది. అందుకని జెన్నీ ఎప్పుడూ మార్క్స్ని అడుగుతూ వుండేది.

"పుస్తకం పని యెంత వరకు వచ్చింది.?" అని.

"ఇదిగో అయిపోతుంది. అదిగో అయిపోతుంది" అని చెబుతుండే వాడు గానీ..."అసలు మొదలే పెట్టలేదు" అని మాత్రం చెప్పేవాడు కాదు. మార్క్స్ రచనా విధానానికి ఒక పరిమితి ఏమిటంటే..ఆయన ఒకటి ప్రారంభించాక, ఒక ఆలోచననుండి మరొక ఆలోచనలోకి వెళ్లి పోయి, 'పాత ఆలోచన మంచిది కాదు కదా! ఆ ఆలోచనలను మరింత

మథించాలి.' ఇలా ఆయనలో ఆయన మథన పడుతూ ఉండేవాడు. 'ఏదో ఒకటి రాసేద్దాంలే' అని కాక, 'ఏ మాత్రం రాజీ పడకుండా రాయాలి.' అలా అనుకోవడం వల్లనే, ఆయన రాసిన, రాస్తున్న, రాయబోతున్న పుస్తకాలన్నీ కూడా అనుకున్న దానికన్నా చాలా ఆలస్యం అవుతూ వున్నాయి.

అందుకనే ఈ "పొలిటికల్ ఎకానమీ "అనే పుస్తకం ఒక కొలిక్కి రాలేదు. ఈలోగా ఏం చేశాడంటే, అది ఎలాగూ ముందుకు కదలడం లేదు అని, దాన్ని పక్కన పెట్టి, మార్క్స్, ఎంగెల్సు కలసి "జర్మన్ ఐడియాలజీ"అనే పుస్తకం రాశారు. దాన్ని పబ్లిష్ చేద్దామని కొంతమంది పబ్లిషర్స్ ని అడిగితే, ఏ పబ్లిషరూ తీసుకోలేదు బ్రసెల్స్ లోనూ, ఫ్రాన్సులోనూ కూడా. దాంతోటి, మార్క్స్, ఎంగెల్సు ల మిత్రుడు ఒకతను ఆ "జర్మన్ ఐడియాలజీ" పుస్తకం రాత ప్రతిని పట్టుకొని జర్మనీ వెళ్ళాడు, అక్కడ ఎవరైనా పబ్లిషర్ దొరుకుతాడేదేమోనని. ఈ ప్రయత్నాలు ఇలా జరుగుతుండగా 1846 మార్చ్ వచ్చింది. ఈ లోగా గతంలో "పొలిటికల్ ఎకానమీ" పుస్తకాన్ని రాయమని 1500 అడ్వాన్స్ ఇచ్చిన పబ్లిషర్ మార్క్స్ దగ్గరకు వచ్చి...

"ఇక మీరు ఎలాగూ పూర్తి చేసే పద్దతి నాకు కనిపించడం లేదు. ఒక వేళ పూర్తి చేసినా నాకు వద్దు. పబ్లిష్ చెయ్యను. మీరు ఎవరికైనా ఇచ్చేసుకోండి. నాకు అభ్యంతరం లేదు. నేను ఇచ్చిన అడ్వాన్ నాకు వెనక్కి ఇచ్చేయండి."అన్నాడు. అయితే, కొంతలో కొంత మెరుగు ఏమిటంటే, ఆ 1500 ఫ్రాంకులూ నాకు వెంటనే ఇచ్చేయండి అని పీక మీద కూర్చోలేదు. అలా అయితే, మరింత ఇబ్బంది అయ్యేది.

అటు ఎంగెల్స్ కి కూడా అనూహ్యంగా తన తండ్రి వద్ద నుండి రావలసిన డబ్బులు తగ్గిపోయాయి. ఇది ఇలా వుంటే, 1846సంవత్సరం మధ్యలోకి వచ్చేసరికి మార్క్స్, జెన్నిల జీవితంలో మరొక ఆర్థిక సంక్షోభం. తన పుస్తకం రాత ప్రతిని ఒకమిత్రుడు జర్మనీ తీసుకువెళ్ళాడు అనుకున్నాం కదా! అతనికి ఒక వుత్తరం రాశాడు మార్క్స్. "బ్రసెల్స్ లో నా పరిస్థితి అత్యంత దుర్భరంగా వుంది. ఇంట్లో వున్న బంగారం, వెండీ, దుస్తులూ అన్నీ తాకట్టు పెట్టేశాం. కనీసం 100, 150 ఇచ్చేవారు ఎవరైనా వున్నారేమో నని చూస్తున్నాను." అని .

సరిగ్గా అప్పుడే మరొక ఉపద్రవం వచ్చి పడింది. వాళ్ళు ఉంటున్న ఇంటికి అద్దె కాలం ఒక సంవత్సరం పూర్తి అయింది. మళ్ళీ పొడిగించడానికి డబ్బులు లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ఇల్లు ఖాళీ చేసేసి, ఇద్దరు చంటి పిల్లలతో, పని మనిషిని వెంట బెట్టుకొని మార్క్స్, జెన్నీ లు మళ్ళీ బోర్డింగ్ హౌస్ కి వెళ్లారు. బోర్డింగ్ హౌస్ అంటే, ఒక లాడ్జింగ్ లాగా వుంటుంది. కుటుంబాలు ఉండడానికి అంతగా అనుకూలమైనది కాదు ఏదో తాత్కాలికంగా వుండడం కోసమే.

ఈ లోగా ఎంగెల్సు "నా మీద పోలీసు నిఘా ఎక్కువ అయ్యింది. కొన్నాళ్ళు పారిస్ వెళ్తాను " అని పారిస్ వెళ్ళాడు. అప్పటికి మార్క్సుకి కనిపించిన మార్గం ఏమిటంటే, ఆ "పొలిటికల్ ఎకానమీ " అనే పుస్తకం అది పూర్తి చేసి, ఎవరికైనా ఇస్తే, డబ్బులు వస్తాయి అనుకొని దాన్ని ఒక కొలిక్కి తీసుకువచ్చాడు. పుస్తకం పూర్తి అయిపోయిన తర్వాత మొట్టమొదట

అడిగిన పబ్లిషర్ దగ్గరకే మళ్ళీ వెళ్లి, “గతంలో మీరు తీసుకోనన్నారు. కానీ, ఆ పుస్తకం పూర్తయింది. ఇదిగో తీసుకువచ్చాను. ఇది చూసిన తర్వాతైనా తీసుకుంటారా?” అన్నాడు. దానికి ఆ పబ్లిషర్ “ససేమిరా! నాకు వద్దు. ఇంతకు ముందు అన్న మాట మీదే నిలబడతాను. ఈ పుస్తకం మరెవరికైనా ఇచ్చేసుకోండి.”అనడంతో, ఆ ప్రయత్నం కూడా సఫలం కాలేదు.

ఈ లోగా జెన్ని మూడవసారి గర్భవతి అని తెలిసింది. అప్పటికి ఆమెకు ఏడవ నెల. 1846 ఆగస్టు, సెప్టెంబర్ వచ్చేసరికి మార్క్స్ కి సమస్యలన్నీ ఒక్కసారి చుట్టు ముట్టాయి. ఇదేమి ఆయనకు కొత్త కాదు. ఎప్పుడూ ఇలాంటివి ఎదుర్కొంటునే వున్నాడు. ఆ బోర్డింగ్ హౌస్ లో వుండి బిడ్డకు జన్మ నివ్వడం అనేది ఇద్దరికీ నచ్చలేదు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లోతన బాబాయ్ “ఫిలిప్స్” [ఫిలిప్స్ ఎలక్ట్రానిక్స్ సంస్థ] కి వుత్తరం రాశాడు. ”నా పరిస్థితి దారుణంగా వుంది. మా అమ్మను చాలా సార్లు అడిగాను. డబ్బులు ఏమైనా పంపించమని. కనీసం మీరైనా సహాయం చెయ్యండి.” అని పరిస్థితులన్నీ వివరించాడు. ఆ వుత్తరం అందుకున్న ఆయన పెద్ద మొత్తం ఏమీ పంపించలేదు. గానీ, మార్క్స్, జెన్నీలు ఆ బోర్డింగ్ హౌస్ నుండి ఒక చిన్న అద్దె ఇంటికి మారిపోవడానికి సరిపడా డబ్బులు పంపించాడు.

దాంతోటి ఒక చిన్న ఇల్లు చూసుకొని అందులోకి మారారు మార్క్స్, జెన్నిలు. ఎందుకంటే, జెన్ని ప్రసవించే సమయం దగ్గర పడుతోంది. ఇవన్నీ, 1846 లో జరిగిన సంఘటనలు. 1847 వచ్చింది. ఫిబ్రవరి 3 వ తేదిన అంతకు ముందు ఇద్దరు కూతుర్ల తర్వాత మూడవ సంతానంగా ఒక మగపిల్లవాడు పుట్టాడు. ఆ బాబుకి “ఎడ్గర్”అని పేరు పెట్టారు. జెన్నీ తమ్ముడూ, మార్క్స్ క్లాస్ మేటు అతని పేరు కూడా ఎడ్గరే. అతని మీద ప్రేమతోనూ, అభిమానం తోనే ఈ కుర్రవాడికి “ఎడ్గర్”అని పేరు పెట్టుకున్నారు. ఇంకో విశేషం ఏమిటంటే, ఆ బాబు పుట్టినప్పుడు అతని మేనమామ అయిన ఈ ఎడ్గర్ బ్రసెల్స్ లోనే వున్నాడు. అతను కూడా ప్రష్యా లో వుండి, ఈ రాజకీయ కార్య కలాపాల్లో పాల్గొని, అన్నిటిలోనూ అరెస్ట్ అవుతున్నాడు. అతను పోలీసుల దృష్టిలో ఉన్నాడని వాళ్ళ అమ్మ, జెన్నీ దగ్గరకు పంపించింది. [వీళ్ళకైతే, అరెస్టులూ, నిర్బంధాలూ అలవాటే అనుకుందేమో]. అంటే, ఇప్పుడు ఆ ఇంట్లో పెద్దవాళ్ళు నలుగురు. పిల్లలు ముగ్గురు. మొత్తం ఏడుగురు కుటుంబ సభ్యులు.

వీళ్ళు కాకుండా, అక్కడ సమావేశాలకి వచ్చి పోయే వాళ్ళు ఉంటూనే వున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మార్క్స్ ఆర్ధిక స్థితిగతులు ఎలా ఉంటాయో ఆలోచించుకోవచ్చు. అయితే, ఎన్ని ఇబ్బందులు వున్నా గానీ, తన “కమ్యునిస్ట్ కరస్పాండెన్స్ కమిటీ” మీటింగులు గానీ, లండన్ లో వుండే “లీగ్ ఆఫ్ జస్ట్ “ రహస్యసంస్థ తో మంతనాలు గానీ, ఎప్పుడూ ఆపలేదు. మార్క్స్ జీవితాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, తరువాత రోజుల్లో కూడా, రెండు విధాలైన పోరాటాలకు అలవాటు పడ్డాడు. ఒకటి ప్రతి క్షణం పరీక్షించిన ఆర్ధిక ఇబ్బందులూ, రెండు ప్రపంచ కార్మికులను ఏకం చేసి, కమ్యునిస్ట్ సమాజాన్ని స్థాపించడం. ఈ రెండే కాదు. తరువాత రోజుల్లో శారీరక అనారోగ్యం. ఎప్పుడూ “ఉద్యమాలూ, పోరాటాలూ

వీటితో పోలిస్తే, వ్యక్తిగత జీవితం ఒకలెక్క లోనిది కాదు” అంటుండే వాడు మార్క్స్. జెన్ని కూడా దానికి ఎదురు చెప్పేది కాదు.

1847 లో మార్క్స్, ఎంగెల్సులు, లండన్ లో వున్న “ లీగ్ ఆఫ్ జస్ట్ “ సంస్థతో సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో వాళ్ళు ఏం తేల్చుకున్నారంటే, ఇలా “కమ్యూనిస్ట్ కరస్పాండెన్స్ కమిటీ“ బ్రసెల్స్ లోనూ, “లీగ్ ఆఫ్ జస్ట్“ లండన్ లోనూ వుండే కంటే, ఈ రెండు సంస్థల్నీ కలిపేసి, ‘కమ్యూనిస్ట్ లీగ్’అనే పేరుతో ఒకే సంస్థ స్థాపించాలని అనుకున్నారు. దానికి, లండన్ సంస్థ వాళ్ళూ, బ్రసెల్స్ లోని సంస్థలో సభ్యులూ ఒప్పుకున్నారు. ఆ విధంగా “కమ్యూనిస్ట్ లీగ్ “అనే సంస్థ ఆవిర్భవించింది 1847 చివరలో.

అంత వరకూ “ప్రపంచంలోని మానవులందరూ సోదరులు”అనే నినాదం వుండేది. ఇప్పుడు “కమ్యూనిస్ట్ లీగ్ “ ఏర్పడగానే దాని స్థానం లో”ప్రపంచ కార్మికులారా! ఏకం కండి.”అనే నినాదాన్ని రూపొందించారు, మార్క్స్, ఎంగెల్సు కలసే. అయితే, 1847 చివరిలో జరిపిన సమావేశాలకు హాజరు కాలేని వాళ్ళ కోసమూ, అలాగే, యూరప్ లోని కార్మికులందరినీ ఏకం చెయ్యడానికీ, అసలు కమ్యూనిజం అంటే ఏమిటి? కమ్యూనిజం తాలుకా విధి విధానాలు ఎలా ఉండబోతున్నాయి? అనే వాటిని ఒక లఘు పుస్తకంగా తీసుకురావాలని అందరూ కలసి నిర్ణయించుకున్నారు. ఆ బాధ్యతను మార్క్స్, ఎంగెల్సులకు అప్పగించారు. ఇది 1847 నవంబర్ ప్రాంతంలో జరిగింది. ఈ విషయం మార్క్సుని అడిగితే “ఏముంది?ఒక వారం, పది రోజుల్లో ఇచ్చేస్తానని” అన్నాడు. ఎంగెల్సు కూడా ఆ మాటే చెప్పాడు. అది ఒక వారం, రెండు వారాలూ, నెల కూడా దాటిపోయింది. 1848 జనవరి కూడా వచ్చేసింది. అప్పటికి కూడా మార్క్స్ ఏమీ పంపించలేదు. దాంతో ఆ లండన్ లో వున్నవాళ్ళు “ఇదిగో చిట్టచివరి తేది ఇస్తున్నాం. ఈ నెలాఖరు లోగా పంపిస్తే పంపించు లేకపోతే మేమే రాసేసుకుంటాం” అన్నారు.మొత్తానికి 1848 జనవరి చివరి నాటికి అందరూ అనుకున్న కమ్యూనిస్ట్ విధి విధానాలను ఒక 23 పేజీల లఘు పుస్తకాన్ని వాళ్లకు పంపించాడు. దానిలో ఎంగెల్సు సహాయం కూడా వుంది.

అదే “కమ్యూనిస్ట్ మేనిఫెస్టో”.!! నిజానికి ఈ చిన్న పుస్తకం రాస్తున్న సమయానికి,”కమ్యూనిస్ట్ లీగ్ “అనే రహస్య సంస్థ తప్ప, ఒక రాజకీయ పార్టీ అంటూ ఏమీ లేదు. ఇప్పటి వరకూ ప్రపంచ వ్యాపితంగా కొన్ని వందల భాషల్లోకి అనువాదమయింది. లెక్కలేనన్ని ప్రతులు అచ్చు వేశారు. ఇంకా అచ్చు వేస్తూనే వున్న “కమ్యూనిస్ట్ మేనిఫెస్టో [కమ్యూనిస్ట్ ప్రణాళిక ] రాత ప్రతి 1848 జనవరి చివరి నాటికి లండన్ చేరుకుంది. లండన్ లో స్థిరపడిన ఒక జర్మన్ ముద్రాపకుడు ఈ “కమ్యూనిస్ట్ మేనిఫెస్టో “ని కేవలం 800 కాపీలు మాత్రమే ముద్రించి, 1848 ఫిబ్రవరి 24న విడుదల చేశాడు. అప్పటి వరకూ, ఎవరూ ఊహించని, విశ్లేషించని, రాయడానికి సాహసించని విప్లవాత్మక భావాల సమాహారమైన ఈ పుస్తకం, ఒక రూపాన్ని సంతరించుకొని, అచ్చు రూపంలో వెలుగు చూసింది.

ఒక విశేషం ఏమిటంటే...కమ్యూనిస్ట్ అంటే.. ఎర్రరంగు గుర్తుకు వస్తుంది కదా! కానీ, చిత్రం గా "కమ్యూనిస్ట్ మేనిఫెస్టో " పుస్తకం మొదటి ముద్రణ కవరు పేజి ముదురు ఆకుపచ్చ రంగులో వుంది. అంతే కాకుండా కవరు పేజి మీద రచయితల పేర్లు కూడా లేవు. అందులోని సారాంశం క్లుప్తంగా "బూర్జువా వ్యవస్థల్లోని వివిధ వర్గాలూ, వర్గ వ్యత్యాసాలూ అంతరించి, అందరికీ సమాన అవకాశాలూ, అందరికీ అభివృద్ధి రావాలి. ఇది జరగాలంటే, ఇప్పుడున్నటు వంటి వ్యవస్థను బలవంతంగా నైనా కూలదోసి శ్రామికుల చైతన్యంతో, కమ్యూనిస్ట్ విప్లవం పురుడు పోసుకోవాలి." ఆ పుస్తకం చివరిలో మార్క్స్ ఇచ్చిన నినాదం "ప్రపంచ కార్మికులారా! ఏకంకండి.....పోరాడితే పోయేదేమీ లేదు. సంకెళ్ళు తప్ప...జయించడానికి ప్రపంచం వుంది మీ ముందు."

ఇది జరిగింది 1848 మొదట్లో అనుకున్నాం కదా! అదే సంవత్సరం యూరప్ లోని అన్ని దేశాల్లో కూడా తిరుగుబాటు ఉద్యమాలు బయలుదేరాయి. ఎలాగంటే, యూరప్ లోని అన్ని దేశాల్లో కూడా రాచరికపు వ్యవస్థ వుండేది. ప్రతి దేశానికీ ఒక 'రాజు' ఉండేవాడు. ఆ రాచరికపు వ్యవస్థ మీద తిరుగుబాటు మొదట స్విట్జర్లాండ్ లో ప్రారంభం అయి, ఆస్ట్రియా మీదుగా ఫ్రాన్స్ వరకూ వచ్చింది. ఆ పోరాటాల్ని అన్నిటిని కలిపి "1848 తిరుగుబాట్లు" అంటారు. ఆసక్తి వున్నవారు ఇంటర్ నెట్ లో ' 1848 రివల్యూషన్స్' అని వెతికితే దొరుకుతాయి. ఈ తిరుగుబాట్లు అన్ని కూడా యే దేశానికి, ఆ దేశంలో జరిగినవే గానీ, అందరూ కలసి అనుకొని, ఒక దేశం నుండి మరొక దేశానికి జయించుతూ వెళ్ళడం లాంటివి కావు. ఏ దేశంలో ఉన్నటు వంటి ప్రజలు, ఆ దేశం రాజు మీద తిరగబడ్డారు.

ఎందుకు? వాళ్ళ కోరికలు ఏమిటి? ప్రభుత్వాధికారంలో ప్రజలకు భాగస్వామ్యం కావాలి.పత్రికా స్వేచ్ఛ కావాలి. ఇలాంటి కారణాలు చాలా చెప్పారు. దాంతోటి మధ్య తరగతి వాళ్ళూ, వున్నతి తరగతి వాళ్ళూ కూడా రాజుల మీద తిరగబడి, ప్రభుత్వాలను చేతుల్లోకి తీసుకుంటూ వస్తున్నారు. అయితే, ఈ సమయంలో కార్మికులూ, క్రింద తరగతి వాళ్ళూ ఈ ఉద్యమంలో భాగస్తులు కాలేదు. ఫ్రాన్స్ లో 1848లో రాచరికపు ప్రభుత్వాన్ని కూలదోసి, ఉద్యమ ప్రభుత్వాన్ని నెలకొల్పారు ఉద్యమకారులు. అయితే, మార్క్స్, ఎంగెల్సు లు ఆశించిన విప్లవం లో ఇది ఒక భాగం మాత్రమే. వాళ్ళు అనుకున్నట్లుగా , క్రింది తరగతుల వారికీ, అలాగే శ్రామికులకీ కొత్తగా ఏర్పడినటు వంటి ప్రభుత్వంలో ప్రాతినిధ్యం లేదు. అందువల్ల ఎవరైతే రాచరికాన్ని కూలదోసారో వాళ్ళకీ....మిగతా శ్రామికులకీ, క్రింది తరగతి వాళ్ళకీ కూడా ఫ్రాన్స్ లో ఘర్షణలు మొదలయ్యాయి. దాన్ని "ప్రతి విప్లవం"అని కూడా అంటుంటారు. అయితే ఫ్రాన్స్ లో వచ్చిన విప్లవమూ, ప్రతి విప్లవమూ వీటి ఫలితంగా ఫ్రాన్స్ లో వీధి వీధినా రక్తం ఏరులై ప్రవహించింది. ఇదంతా 1848 మొదట్లో. అంటే, మార్క్స్ "కమ్యూనిస్ట్ మేనిఫెస్టో "రాస్తున్న సమయంలో, మిగతా దేశాల్లో జరుగుతున్న సంఘటనలు.

ఈ నేపధ్యంలో పారిస్ లో ఉన్నటు వంటి కొంత మంది మిత్రులు మార్క్సకి హెచ్చరిక చేశారు. "ఈ తిరుగుబాటు సెగ బెల్జియంకి కూడా వ్యాపించేటట్లు వున్నాయి. మీరు సిద్దంగా వుండాలి."అని. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే, బ్రసెల్స్ లో కూడా పోరాటాలు ప్రారంభమైతే, ఊరి చివర పిల్లలతో వుండడం క్షేమం కాదనీ, ఆ ఇల్లు ఖాళీ చేసేసి, రక్షణగా ఉంటుందనిమళ్ళీ గతంలో ఉండే బోర్డింగ్ హౌస్ లోకి వచ్చేశారు. మార్క్స, మరి కొంత మంది మిత్రులూ కలసి, 'ఫ్రాన్స్ విప్లవం విజయవంతం అయింది కాబట్టి, బెల్జియం లో కూడా రాచరికానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేయాలి. అందుకు ప్రజల్ని సిద్దం చేయాలి 'అనుకొని, ఒక బహిరంగ సభ నిర్వహించారు. 1848 మార్చి ప్రాంతాల్లో. ఆ బహిరంగ సభలో కొన్ని అల్లర్లు చెలరేగాయి. బెల్జియం ప్రభుత్వం దీన్ని తీవ్రంగా భావించి, దీనికి కారణం జర్మన్ నుండి వలస వచ్చిన వీళ్ళే అనుకొని, బెల్జియం లో వున్న జర్మన్స్ అందరి మీదా నిఘా పెంచింది. 'ఏ క్షణాన్నయినా సరే, ఈ జర్మన్ నుండి వచ్చిన వాళ్ళందరి మీదా పోలీసులు దాడి చేయవచ్చు' అని తెలిసి, ఆత్మ రక్షణ కోసమని బెల్జియం వున్న జర్మన్స్ అందరూ ఆయుధాలు సమకూర్చుకున్నారు. వీళ్ళందరికీ మార్క్స నాయకుడు లాంటి వాడు కాబట్టి, ఈ ఆయుధాలు సమకూర్చుకోవటంలో మార్క్స హస్తం కూడా వుంది.

ఇదే సమయంలో – మార్క్స కి అనుకోకుండా ఆరు వేల ఫ్రాంకులు వాళ్ళ అమ్మగారి దగ్గర నుండి వచ్చాయి. మార్క్స ఎప్పటి నుండో అడుగుతున్నాడు. "వారసత్వంగా నాకు ఇవ్వవలసింది ఇవ్వండి." అని. దానికి వాళ్ళ అమ్మగారు "ప్రస్తుతానికి ఈ ఆరు వేల ఫ్రాంకులూ ఉంచుకో. నువ్వు ఇబ్బందుల్లో వున్నావని తెలిసింది." అంది. దాంతోటి అప్పటి వరకూ వున్న అప్పులు తీర్చేశాడు. ఇంకా మిగిలిన డబ్బులు తన దగ్గర వుంచుకుంటే, మరో 2,3 ఏళ్ళ వరకు ఏ ఇబ్బంది లేకుండా సరిపోతాయి. కానీ, అదే సమయంలో ఈ జర్మన్లందరూ ఆయుధాలు సమకూర్చుకుంటున్నారు. అనుకున్నాం కదా! వాళ్ళందరికీ ధన సహాయం చేయడం ప్రారంభించాడు. తన గురించీ, తన కుటుంబం గురించీ, తన భవిష్యత్తు గురించీ తన ఆర్ధిక స్థితి గురించీ ఏనాడూ ఆలోచించలేదు. మిగిలిన డబ్బులన్నీ వాళ్లకి ఇస్తుంటే..బ్రసెల్స్ లో వున్న ప్రభుత్వం ద్రుష్టికి వచ్చింది. నిన్నటి వరకు తిండికి ఇబ్బంది పడేవాడు, ఇంటి అద్దె కట్టలేక అటూ, ఇటూ మారుతున్నాడు. అలాంటిది ఒక్కసారి ఇంత డబ్బు ఎలా వచ్చింది? అందరికీ సహాయాలు కూడా చేస్తున్నాడు. అని సరైన ఆధారాల కోసం వెతకడం ప్రారభించడమే కాకుండా,మార్క్సని కూడా ప్రశ్నించారు.

ఆయన చెప్పాడు "మా అమ్మ పంపించింది "అని. అయితే వాళ్ళు, ప్రష్యా ప్రభుత్వానికి తెలియజేయడమే కాకుండా, ప్రష్యా పోలీసులు అక్కడ వున్న వాళ్ళ అమ్మగారి దగ్గరకు వెళ్లి, "నువ్వు డబ్బులు పంపించావా? లేకపోతే, మీ అబ్బాయికి డబ్బులు ఎక్కడనుండి వచ్చాయి? అని ఆమెను ప్రశ్నించారు. అంతే కాకుండా, "మా అబ్బాయి ఇబ్బందుల్లో ఉన్నాడని నేనే ఆ డబ్బులు పంపించాను " అని రాసి, ఆమె దగ్గర నుండి సంతకంతో కూడిన ఒక వినతి పత్రం తీసుకున్నారు.

ఇక్కడ ఇంత హడావుడి జరుగుతుండగా,వ్అక్కడ బ్రసెల్స్ లో మార్క్స్ ఒక చిన్న వీధిలో వుండగా, ఎవరో ఇద్దరు వ్యక్తులకు 2 వేల ఫ్రాంకులు ఇవ్వడం పోలీసులు చూశారు. "ఈ డబ్బు ఎందుకు ఇస్తున్నావు ?"అని అడిగారు. " నేను గతంలో వాళ్ళ దగ్గర అప్పు తీసుకున్నాను.అది తీరుస్తున్నాను "అన్నాడు మార్క్స్. నిజానికి ఆయన ఆయుధాల కోసమే ఇచ్చాడు ఆ డబ్బులు. కానీ, మార్క్స్ చేసినటువంటి సహాయం ఆయుధాల కోసమని రుజువు అయితే, మార్క్స్ కి ఉరి శిక్ష కూడా పడవచ్చు. అలాంటి రోజులు అవి. ఆ రోజుల్లోనే మార్క్స్ తో పనిచేసిన కొంతమందిని బెల్జియం నుండి పంపించి వేసింది ప్రభుత్వం.

ఈ పరిస్థితుల్లో, ఏ క్షణం లోనైనా, ఏదైనా ప్రమాదం జరగవచ్చు అనుకొని మార్క్స్, జెన్నీతో ఏమన్నాడంటే.."ముగ్గురు పిల్లల్నీ తీసుకొని నువ్వు మీ పుట్టింటికి వెళ్ళిపో. నాకు ఏమైనా జరగవచ్చు."అన్నాడు. జెన్నీ దానికి ససేమిరా ఒప్పుకోలేదు. "చావైనా, బ్రతుకైనా మేమందరమూ నీతోనే వుంటాము." అని, బ్రసెల్స్ వదలి వెళ్ళడానికి ఇష్టపడలేదు. రోజు రోజుకీ వాతావరణం వేడెక్కుతోంది. 1848 మార్చి 3వ తారీఖు వచ్చేసరికి, పరిస్థితులన్నీ పతాక స్థాయికి చేరుకున్నాయి. ఏ క్షణం లోనైనా పోలీసులు తనని అరెస్ట్ చేస్తారేమోనని, మార్క్స్ పోలీసులకు తెలియకుండా వుండాలని, బ్రసెల్స్ బయట ఎవరో మిత్రులు వుంటే, వారి దగ్గర పడుకుంటున్నాడు. మార్చి 3 తేదిన పిల్లలు ఎలా వున్నారో చూద్దామని ఇంటికి వచ్చాడు. మార్క్స్ ఆ బోర్డింగ్ హౌస్ కి వచ్చాడని సమాచారం అందిన పోలీసు ఆఫీసర్లు వచ్చేశారు. ఒక నోటీసు అందించారు. ఏమనీ? "24గంటల్లోగా మీరు బ్రసెల్స్ వదలి వెళ్ళిపోవాలని"

ఇక్కడ నుండి అంటే 1848 మార్చి 3వ తేది సాయంత్రం 5గంటల నుండి మొదలయిన ఈ సంఘటనలు, గుండెలు బిగబెట్టిన సస్పెన్సు సినిమాల క్లయిమేక్స్ దృశ్యాల్ని తలపిస్తుంటాయి. ఏం జరిగిందంటే? ఎలాగూ తను దేశం వదలి వెళ్లక తప్పదని మార్క్స్ కి తెలుసు. దాంట్లో ఎలాంటి సంప్రదింపులూ జరపడానికి అవకాశాలు లేవు. ఎందుకంటే, ఆయన చేస్తున్న కార్యక్రమాల్ని చాలా తీవ్రంగా పరిగణిస్తూ వచ్చింది. అయితే, మార్క్స్ ఒక విజ్ఞప్తి చేద్దామని అనుకున్నాడు. "నేను మాత్రం వెళ్ళిపోతాను. కానీ, నా భార్యా, పిల్లలూ కనీసం సర్దుకోవడానికి ఒక వారం అనుమతి ఇవ్వండి."అని, కానీ, దానికి జెన్నీ ఒప్పుకోలేదు. ఆమె అంది "మీరు అలాంటివి చెయ్యొద్దు. వాళ్ళని మళ్ళీ అనుమతి కోసం అడగొద్దు. మేం అంతా కూడా మీతోనే వచ్చేస్తాం. మీరు ఎన్ని కష్టాలు పడుతున్నా సరే, మీ వెనకాలే వుంటాం."అని ఆ ప్రయత్నాన్ని వారించింది. ఇక జెన్నీ, ఆమె సహాయకురాలు హెలెన్ ఇద్దరూ కలసి సామాన్లు సర్దుకోవడం మొదలెట్టారు. మరుసటి రోజు సాయంత్రం 5 గంటల లోగా బ్రసెల్స్ వదలి వెళ్లిపోవాలి.

మారుతున్న పరిస్థితుల్ని చూస్తున్న వాళ్ళ మిత్రులు వచ్చారు మార్క్స్, ఎంగెల్సుల దగ్గరకు. "అసలు ఏం చేద్దాం ? భవిష్యత్ కార్యాచరణ ?" అని చర్చించడం మొదలు పెట్టారు.. అక్కడ ఫ్రాన్స్ లో రాచరికాన్ని కూలదోసి వచ్చినటు వంటి

ప్రభుత్వం లోనికి వచ్చిన వాళ్ళు మార్క్సుకి తెలిసిన వాళ్ళే. అంటే, మార్క్సు, ఎంగెల్సు ల మిత్రలందరికీ. "కమ్యునిస్ట్ లీగ్ ' అక్కడ నుండి నడిపించ వచ్చు. మీరు అక్కడకు వెళితే బాగుంటుంది." అని సలహా ఇచ్చారు కొంతమంది మిత్రులు.

ఆ రోజు సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకూ మార్క్సు ఇంటికి వచ్చేవాళ్ళూ, వెళ్ళే వాళ్ళూ. సమావేశం అనంతరం మార్క్సుకు "కమ్యునిస్ట్ లీగ్" ను పారిస్ నుండి నడపడానికి అధికారం ఇచ్చారు. ఇదంతా జరుగుతున్నప్పుడు పోలీసులు ఊరుకోరు కదా! వాళ్ళంతా కూడా మఫ్టీ లో ఆ బోర్డింగ్ హౌస్ చుట్టూ తిరుగుతూనే వున్నారు. అర్ధ రాత్రి ఒంటి గంట సమయంలో ఆ బోర్డింగ్ హౌస్ తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లారు. ముందుగా మార్క్సు ఉన్నటువంటి పోర్షను లో జెన్నీ, పిల్లలూ నిద్రపోతున్న గది లోనికి వెళ్ళి, వాళ్ళని లేపి, వాళ్ళు ఉంటున్న గదంతా సోదా చేశారు. అక్కడ బ్రసెల్స్ పోలీసులకు ఏమీ దొరకలేదు.

అక్కడ నుండి పై అంతస్తులో మార్క్సు ఉన్నటు వంటి గది వుంది. అక్కడకు వెళ్ళి, ఆ తలుపు తట్టారు. తలుపు తీసేసరికి మార్క్సు నైట్ డ్రెస్ లో వున్నాడు. టేబుల్ మీద సగం తాగిన వైన్ గ్లాసులు వున్నాయి. అవన్నీ చూస్తే, అప్పటివరకూ, మనుషులు వచ్చి వెళ్ళి నట్లు ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. అక్కడ ఉన్నటు వంటి పేపర్లు అన్ని వెతికారు. అందులో స్పష్టంగా "కమ్యునిస్ట్ లీగ్" అనే సంస్థను పారిస్ నుండి కొనసాగించనున్నట్లు ఖరారు అయినటువంటి పత్రాలు కనిపించాయి. అప్పుడు మార్క్సును ప్రశ్నించారు "అసలు నీకు బ్రసెల్స్ లో ఉండడానికి అధికారం వుందా? అనుమతి పత్రం వుందా?నీ పాస్ పోర్ట్ చూపించు ?" అని. ఇక్కడ గతంలో జరిగిన ఒక విషయం గుర్తు తెచ్చుకోవాలి. మార్క్సు బ్రసెల్స్ లో వుండగానే, ప్రష్యా ప్రభుత్వాన్ని తన పౌరసత్వాన్ని రద్దు చేయమని రాశాడు. అందుకని ప్రస్తుతం అతను ఏ దేశ పౌరుడూ కాదు. బ్రసెల్స్ లో ఉండడానికి కూడా అతనికి అధికారకమైన అనుమతి ఇవ్వ లేదు. అప్పుడేదో కాంట్రాక్ట్ రాసి, కొద్ది రోజులుండడానికి వచ్చాడంతే. దాంతోటి 'సరైనటువంటి పాస్ పోర్ట్ లేదు' అనే కారణం తోటి మార్క్సుని అరెస్ట్ చేసి బ్రసెల్స్ పోలీసులు వెంట తీసుకెళ్ళారు. అది అర్ధరాత్రి 2 గంటల సమయం.

ఇక ఇంట్లో మిగిలినదల్లా జెన్నీ, హెలెన్, ముగ్గురు పిల్లలూ. పసి పిల్లలు ముగ్గురూ అమాయకంగా నిద్ర పోతున్నారు. జెన్ని ఆ సమయంలో అంటే, అర్ధరాత్రి రెండున్నర, మూడు గంటల సమయంలో బ్రసెల్స్ వీధుల్లో పరుగో, నడకో తెలియనంత వేగంతో దగ్గర్లో ఉన్నటువంటి మిత్రుల దగ్గరకు వెళ్ళింది. అందులో ఒకతను లాయరు. మార్క్సు కి బాగా తెలిసిన వ్యక్తి. గడ గడా వణికించే చలి. ఆమె వేసుకున్న చలి కోటు కూడా సరైంది కాదు. మంచివి అన్నీ గతంలోనే తాకట్టు పెట్టేశారు. అలా వెళ్ళి, ఆ మిత్రుడి ఇంటి తలుపు తట్టి "మార్క్సును పోలీసులు తీసుకెళ్ళారు. మరి మీరు పోలీసుల దగ్గరకు గానీ, కోర్టుకు గానీ వెళ్ళాలి" అని జరిగింది చెప్పింది.

ఆయన "సరే ! అలాగే పొద్దున్నే వస్తాను " అని చెప్పాడు. అక్కడ నుండి బోర్డింగ్ హౌస్ కి వచ్చేటటు వంటి త్రోవలో దగ్గరలో ఉన్నటువంటి మిత్రులందరి వద్దకూ తలుపులు తట్టి చెప్పింది జెన్ని. "రేపు సాయంత్రం లోగా వెళ్లిపోవాలి. మార్క్సని పోలీసులు తీసుకెళ్ళారు."అని. వాళ్ళలో ఒక మిత్రుడు జెన్నీకి సహాయం గా వచ్చాడు. "నేను కూడా వస్తాను. నువ్వు ఒక్కర్తివే వెళుతున్నావు" అని బోర్డింగ్ హౌస్ దగ్గరకు వచ్చారు ఇద్దరూ. వాళ్ళు అక్కడకు చేరేసరికి అక్కడ మళ్ళీ పోలీసులున్నారు.

ఆ పోలీసులు జెన్నినీ, ఆ వెంట వచ్చిన మిత్రుడి తోనూ "మార్క్సను చూపిస్తాం పదండి. అని చెప్పి పోలీస్ స్టేషన్ కి తీసుకువెళ్ళారు. ఆ వెంట వచ్చిన మిత్రుడు వాళ్ళతో వాదించడం మొదలుపెట్టాడు. "అసలు మార్క్సను ఎందుకు అరెస్ట్ చేశారు? రేపు వాళ్ళను వెళ్లి పొమ్మని చెప్పారు కదా!"అంటూ ఏవేవో అంటున్నాడు.అలా అతను అడిగేసరికి అతన్ని కూడా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. ఇక జెన్ని మాత్రం మిగిలింది. ఆమెను ప్రశ్నించడం ప్రారంభించారు.

" నీ పాస్ పోర్ట్ ఏది? నీ అనుమతి పత్రాలు ఏవి?"అని అడిగారు.ఆమె దగ్గర సహజంగానే అవేవి లేవు. అప్పుడు జెన్నీని కూడా అరెస్ట్ చేసి, ఆమెను వ్యభిచారుణులు వుండే గదిలో పెట్టారు. 24 గంటలు అనే గడువు ఆ సాయంత్రం 5 గంటలతో పూర్తవుతుంది. ఈ సంఘటన జరిగే సమయానికి ఇంకా 12గంటలు మాత్రమే వుంది. ఇంటి దగ్గర ముగ్గురు పిల్లలూ, హెలెన్ మాత్రమే వున్నారు. జెన్నీకి గడచిన ఆ గంటా, రెండు గంటలూ రెండు యుగాల్లాగా గడచింది.

తెల్లవారింది. జెన్ని తను ఉన్నటువంటి జైలు గదిలోనుండి చూస్తుంటే, పోలీసుల వలయం నుండి మార్క్స వెళుతున్నాడు. ఎక్కడకి నడిపించుకు తీసుకు వెళుతున్నారో తెలియదు. బహుశా 'ఉరి తియ్యడానికేమో' నని భయపడింది. ఎందుకంటే, వాళ్ళు ఏం చేసినా అడిగే పరిస్థితి లేదు. కానీ, వాళ్ళు ఆ పని చెయ్యలేదనుకోండి. పది గంటలకి కోర్టుకి తీసుకెళ్ళారు. మార్క్స, జెన్నీలను విచారించాక జడ్జి ఏమన్నాడంటే,

"వీళ్ళకు శిక్ష విధించేటటు వంటి నేరం చేసి నట్లుగా రుజువు ఏమీలేదు. కాకపోతే, వాళ్ళను వెళ్లి పొమ్మన్నాము కాబట్టి, దేశం విడిచి వెళ్లి పోవలిసిందే"నని తీర్పు చెప్పాడు. అప్పటికి సాయంత్రం 3 గంటలయ్యింది. ఇంకా అప్పటికి 2 గంటలు మాత్రమే మిగిలివుంది. ఆ 2 గంటల్లో, అన్ని సర్దుకోవాలి. దేశం విడిచిపెట్టి వెళ్లి పోవాలి. ఆ సమయానికి పిల్లల్ని చూసి 12 గంటలు అవుతోంది. గబగబా ఇంటికి వచ్చారు. సర్దగలిగినవన్నీ సర్దుకున్నారు. మిగిలినవన్నీ మిత్రులకు ఇచ్చేశారు.

బయట నుండి పోలీసులు తొందర చేస్తున్నారు. "సమయం అయిపోతుంది.మీరు బయలు దేరాలి..బయలు దేరాలి.." అంటూ..మొత్తానికి సరిగ్గా నాలుగున్నర గంటలకు బయలుదేరారు పోలీసులు పహారా కాస్తుంటే. పారిస్ వెళ్ళే రైలు ఎక్కారు. మిణుకు... మిణుకు మనే కొవ్వొత్తి వెలుగు, గడ గడ వణికించే చలి. అది మార్చి నెల మొదటి వారం. ఆ రైలు నిండా బెల్జియం పోలీసులు వున్నారు. మార్క్స, జెన్నీ, హెలెన్. ముగ్గురు పసి పిల్లలు. పిల్లలకి చలి వెయ్యకుండా

ఉండేటందుకు ఆ పెట్టెలో ఏదో ఎండు గడ్డి వుంటే, తెచ్చి దాని మీద కూర్చున్నారు. అప్పటికి కూడా ఇంకా పిల్లలు గడగడా వణికి పోతుంటే, జెన్నీ ఒక పాపను తన కోటులో దాచుకుంది. మార్క్స్ కూడా తన కోటులో పిల్లల్ని దాచుకున్నాడు. అలా వాళ్ళ ప్రయాణం ప్రారంభమయింది. ఒక్కసారి ఊహించుకుంటే..ఎలా వుంటుందో చూడండి!!. ఇవన్నీ మార్క్స్ పిల్లల చిన్న వయసులో జరిగిన సంఘటనలు. అప్పటికి ఆ పిల్లల వయసు పెద్దమ్మాయికి 4 సంవత్సరాలు. రెండో అమ్మాయికి 2 సంవత్సరములు. ఆఖరి అబ్బాయికి ఒక సంవత్సరం మాత్రమే. ఈ రైలు ప్రయాణం ఇలా సాగుతూవుండగా ఒక్కసారి ఈ కథలో కాలాన్ని ముందుకు నడిపి ఈ పిల్లలు ఏమయ్యారో తెలుసుకుని మళ్ళీ వెనక్కి వద్దాం.

ఈ ముగ్గురిలో పెద్దమ్మాయి తండ్రి కంటే రెండు నెలల ముందే చనిపోయింది. రెండో అమ్మాయి తలిదండ్రులు చనిపోయిన దాదాపు ముప్పయి సంవత్సరాలకి భర్తతో కలసి ఆత్మహత్య చేసుకుంది. ఇక మూడవ సంతానం కొడుకు, మార్క్స్, జెన్నీలను వెంటాడిన దారిద్ర్యానికి బలయిపోయి 8 ఏళ్ళ వయసులో మరణించాడు. వీటికి సంబందించిన వివరాలన్నీ తరువాత తెలుసుకుందాం. మళ్ళీ వర్తమానానికి అంటే, పారిస్ వెళుతున్న రైలు వద్దకు వద్దాం.

ఆ ప్రయాణం కూడా ఏమంత సజావుగా సాగలేదు. ఎందుకంటే, అప్పటికే పారిస్ వీధుల నిండా పోరాటాలు జరుగుతున్నాయి అనుకున్నాం కదా! అక్కడక్కడ రైలు పట్టాలు తెగ్గొట్టేసి వున్నాయి. దాంతోటి రైలు ఆపేయడం. అక్కడ నుండి ప్రయాణికులను గుర్రపు బళ్ళల్లో తీసుకెళ్ళి, అక్కడ మరో రైలు ఎక్కించడం లాంటివి జరిగాయి. ఒక పక్క చలి. ముగ్గురు పిల్లల్నీ, వెంట తెచ్చుకున్న కొద్ది పాటి  సామాన్లనీ మోసుకుని...అలా ప్రయాణం చేసి, మొత్తానికి మర్చి 5వతేదిన పారిస్ చేరుకున్నారు. అప్పటికే మిత్రులకు చెప్పి వున్నారు కాబట్టి, ఉండడానికి ఏదో దొరికింది. కాకపోతే పారిస్ లో ఒక నెల కంటే లేరు. ఎందుకంటే, ఈయన కార్య కలాపాలూ, తీవ్ర వాదులతో కలవడం, వాళ్లకి ఏం చెయ్యాలో చెప్పడం, ఇలాంటివి ప్రారంభమయ్యాయి. అప్పటికి పారిస్ ప్రభుత్వంలో వున్న కొద్ది మంది మిత్రులు ఏమన్నారంటే...”నువ్వు ఒక పత్రిక ప్రారంభించు, మేం సహాయం చేస్తాం.”అన్నారు. కానీ, ప్రభుత్వం నడిపేటటు వంటి పత్రికలకు సంపాదకత్వం వహించడం ఇష్టం లేక, మార్క్స్ ఆ ప్రతిపాదనకు ఒప్పుకోలేదు.

ఈలోగా జర్మనీలో కూడా ఈ తిరుగుబాటు పోరాటాలు జరిగి, అక్కడ ‘రాజు’ రాజ్యాధికారం కూలదోసి, రిపబ్లిక్ ప్రభుత్వం వచ్చిందని మార్క్సుకు తెలిసింది. ఇది జరిగింది జర్మనీలో, ప్రష్యాలో కాదు. ప్రష్యా, జర్మన్ కాన్ఫెడరేషన్ లో ఒక భాగం అని గతంలో అనుకున్నాం. ”అందువల్ల అక్కడ కూడా ఈ విప్లవ పరిస్థితులు వస్తున్నాయి కాబట్టి, మనం అక్కడ వుంటే, ఎక్కువ కార్యక్రమాలు చేయడానికి వీలు వుంటుంది. మన ఆశయం ఈ రిపబ్లిక్ ప్రభుత్వాన్ని స్థాపించడమే” అని మార్క్స్, అతని అనుచరులూ కూడా అనుకున్నారు. కాబట్టి, “ఒక ప్రణాళిక ప్రకారం జర్మనీ లోని వివిధ నగరాలకి వెళ్దాము.” అని నిర్ణయించుకున్నారు. మార్క్స్, ఎంగెల్సు అలాగే మార్క్స్ కుటుంబం అందరూ కూడా ప్రష్యా లోని “కొలోన్ "అనే నగరానికి వెళ్దాము అనుకున్నారు. అలాగే, మార్క్స్ మిత్రులు వేరేవేరే నగరాలకి వెళ్లారు. వీళ్ళ ప్రణాళిక

ఏమిటంటే, అక్కడ వుండి, ఉద్యమాల్ని నిర్మించాలి. అక్కడ రాజ్యాన్ని కూడా పడగొట్టాలి. అలా కొలోన్ వెళ్ళారు. అయితే మార్క్స్ కి ఏ దేశ పౌరసత్వమూ లేదు కదా! అందుకని, కొలోన్ లో తనకు "పౌరసత్వం కావాలని" దరఖాస్తు పెట్టుకున్నాడు. యెంత విచిత్రం. తను పుట్టిన దేశంలోనే తనకు పౌరసత్వం కావాలని దరఖాస్తు పెట్టుకోవాల్సిన పరిస్థితి. అయితే, వాళ్ళు ఏమన్నారంటే..."ఈ దరఖాస్తు పరిశీలించడానికి సమయం పడుతుంది. కాకపోతే, ఒక సంవత్సరం పాటు ఇక్కడ ఉండడానికి తాత్కాలికంగా అనుమతి ఇస్తున్నాము."అని మార్క్స్ దంపతులతో చెప్పారు.

మార్క్స్ అప్పటికి ఇంకా స్థిర పడలేదు కాబట్టి, జెన్నీనీ, హెలెన్ నీ, పిల్లల్నీ ట్రయర్ దగ్గరలోనే వున్న జెన్నీ అమ్మగారి ఇంటికి పంపించేశాడు. ఆ తరువాత మరో మూడు నెలలకు మార్క్స్ దగ్గరకు వచ్చింది. అక్కడ అంటే, కొలోన్ లో కూడా ఒక సంవత్సరం మాత్రమే వున్నారు. ఏం జరిగిందంటే, ఆయన ఉద్దేశ్యమే ఉద్యమాలు నిర్మించడం కదా! దానికి తోడు ఎంగెల్సు కూడా వున్నాడు. దాంతో ఆయన అంతకు ముందు ఆరు సంవత్సరాల క్రిందట ఆపేసిన పత్రికను మళ్ళీ ప్రారంభించాడు. అందులో ఈ విప్లవ తిరుగుబాటు చేసే వాళ్ళను సమర్ధిస్తూ, వాళ్లకు సంబంధించిన వార్తలు ఎక్కువగా రాస్తుండేవాడు. అలాగే రాజకీయాల మీద ఎక్కువగా కేంద్రీకరించి, వాళ్ళను ఎక్కువగా విమర్శిస్తూ ఉండేవాడు.

అంతే కాకుండా,ఈ "కమ్యునిస్ట్ లీగ్ అనే దాన్ని రద్దు చేసేద్దాము. ఇలా రహస్యంగా చేస్తే గనక విప్లవం రాదు.బయటకు వచ్చి చెయ్యాలి." అని అభిప్రాయపడి,ఆ "కమ్యునిస్ట్ లీగ్" రద్దు చేసేశారు. కానీ, తన పత్రికలో మాత్రం ఇలాంటి వార్తలు రాస్తుండేవాడు. ఒక సంవత్సర కాలం పాటు తన పాత్రికేయ వ్యాసాలతో గడగడ లాడించాడు. ఎంతగా అంటే, ప్రజలు, పోలీసుల మీద తిరగబడేటప్పుడు ఆ గొడవల్లో ఏమైనా జరుగుతుందేమోనని, తన పత్రికాఫీసులో ఆయుధాలు పెట్టుకుని, ఆయన పత్రికను నడిపిస్తుండేవాడు.

ఆ పత్రిక యెంత సంచలనం కలిగించిందంటే, అది ప్రారంభించిన రెండు నెలల్లోనే ఏభైవేల కాపీలు అమ్ముడయ్యాయి. దాంతోటి, ఆ పత్రికను చూద్దామని విదేశీయులు కూడా ఆ పత్రికాఫీసును సందర్శిస్తూ వుండేవారు. ఇవన్నీ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు కదా! అప్పుడు ఈ పత్రికను అణచివేసే దిశగా అడుగులు వేసి, చాలా సార్లు మార్క్స్ మీద కేసులు పెట్టింది. ఆ కేసులన్నీ తీవ్ర స్థాయికి వచ్చి, 1849 మే వచ్చేసరికి, మళ్ళీ మార్క్స్ కి "24 గంటలలోగా ఈ ప్రష్యా వదలి వెళ్లిపోవాలి " అని తాకీదు ఇచ్చారు. ఆ విధంగా కేవలం ఒక సంవత్సర కాలం మాత్రమే వున్నారు ప్రష్యాలో.

ఇంత వరకూ జరిగిన సంఘటనలన్నీ మొత్తంగా ఒక్కసారి చూడండి. ఎన్ని మజిలీలో!!. ఈ సమయానికి మార్క్స్ వయసు కేవలం 31 సంవత్సరాలు మాత్రమే. 5 ఏళ్ళలో 4 దేశ బహిష్కరణలు. కొన్ని సార్లు "24 గంటల్లో దేశం విడిచి వెళ్లిపోవాలి" అన్న ఆదేశాలు. ప్రభుత్వాలే భయపడేటంతగా మార్క్స్ ఏం చేశాడు? అని చూస్తే....ఆయన భావాలు బందూకులయ్యాయి. ఆయన అక్షరాలు అగ్ని వుండలయ్యాయి. అందుకే కేవలం 31సంవత్సరాల వయసుకే దేశాలకి, దేశాలు అదిరిపడేటట్లు చెయ్యగలిగాడు. జీవితాంతమూ కొనసాగిన ఈ వ్యక్తిత్వమే శతాబ్దాల తరబడి ఆయన్ని వార్తల్లో

వ్యక్తిగా నిలబెట్టింది. ఈ ప్రష్యా నుండి బహిష్కరించిన తర్వాత ఆయన మళ్ళీ పారిస్ వెళ్లి, అక్కడ కొద్ది రోజులు వుండి, అక్కడ నుండి లండన్ వెళ్ళడం, ఆ తరువాత జీవితాంతం మరో 34 సంవత్సరాల పాటు అక్కడ వున్నప్పుడు ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయో తర్వాత తెలుసుకుందాం.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

.

2019 అక్టోబర్ 22 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు
https://youtu.be/Gp5RPqZ8VYQ

COMMENTS